ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 216 | పేజీలు: 5 | వెల: రూ.3/- | శుక్రవారం 13 నవంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

టిమ్స్ ఆసుపత్రులకు డెడ్‌లైన్

నిమ్స్ - టిమ్స్ సమన్వయం.. ఒకే రిక్రూట్‌మెంట్

తెలంగాణ వైద్య రంగంలో భారీ మార్పులు... సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 12 (ప్రభాత ఉదయం)

రాష్ట్రంలోని టిమ్స్ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలల అభివృద్ధికి అదనంగా అవసరమైన నిధులను మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. అదేవిధంగా, డిసెంబర్ నాటికి కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

డిసెంబర్ నాటికి ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తి కావాలి - అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

జూన్ 2 నాటికి అన్ని టిమ్స్‌లు అందుబాటులోకి రావాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. డిసెంబర్ వరకు ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తికావాలని సూచించారు. మూడు టిమ్స్ లకు ఒకేసారి నియామకాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. వాటి ఉద్యోగుల బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. టిమ్స్ హౌస్ కీపింగ్‌ను పూర్తిగా ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వాలన్నారు. నిమ్స్ లో బెడ్స్ ఖాళీ లేక పోతే రోగులను సనత్ నగర్ టిమ్స్ కు తరలించాలని సూచించారు. నిమ్స్,టిమ్స్ మధ్య సమన్వయం ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. సనత్ నగర్ టిమ్స్ లో డాక్టర్ల నియామకమయ్యే వరకు బయట



నుంచి నియమించుకోవాలని అధికారులకు సూచించారు. టిమ్స్, ప్రభుత్వ వైద్య కళాశాలలకు అదనంపు నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమని తెలిపారు.

హైదరాబాద్, నవంబర్12: రాష్ట్రంలోని మూడు టిమ్స్ కు ఒకే రిక్రూట్‌మెంట్ చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉద్యోగుల బదిలీలు ఈ మూడు టిమ్స్ మధ్య జరిగేలా ఉండాలని సూచించారు. గురువారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వైద్య ఆరోగ్య శాఖపై సీఎం రేవంత రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హౌస్ కీపింగ్ పూర్తిగా అవుట్ సోర్సింగ్‌కు ఇవ్వాలని స్పష్టం చేశారు. డాక్టర్స్ పూర్తిగా వైద్యంపైనే దృష్టి సారించేలా చూడాలని పేర్కొన్నారు. హాస్పిటల్ నిర్వహణ అత్యంత కీలకమని గుర్తు చేశారు. నిమ్స్‌లో బెడ్స్ ఖాళీ లేకుంటే.. రోగులను సనత్ నగర్ టిమ్స్‌కు తరలించాలని ఆదేశించారు. ఈ క్రమంలో నిమ్స్, టిమ్స్ మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. సనత్ నగర్ టిమ్స్‌లో డాక్టర్స్ నియామకం పూర్తయ్యే వరకు బయట నుంచి డాక్టర్స్‌ను నియమించుకోవాలని సూచించారు. టిమ్స్, ప్రభుత్వ వైద్య కళాశాలకి అదనంగా కావాల్సిన నిధులని మంజూరు చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. జూన్ 2వ తేదీన నాటికి అన్ని టిమ్స్ అందుబాటులోకి రావాల్సిందేని అధికారులకు ఆదేశించారు. డిసెంబర్ నాటికి ఉస్మానియా హాస్పిటల్ నిర్మాణం పూర్తి కావాలని పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు విషయంలో సాంకేతికతను వినియోగించాల్సి ఉందని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశానికి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు, సీఎంవో కార్యదర్శి మాణిక్ రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ , రవాణా, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి ఇలంబర్తి ,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ముషరఫ్ అలీ ఫారూఖీ , జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్. వి. కర్ణన్ , రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ జజుూ హనుమంత్ కొండిబా, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ ఎన్. వాణి , నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, ఎ×మీ సనత్‌నగర్ డైరెక్టర్ డాక్టర్ నరేందర్, తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు.



పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వచ్చే దీపావళి నాటికి హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణాలు పూర్తి

రాజేంద్రనగర్‌లో పారదర్శకంగా లక్కీ డ్రా ద్వారా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు.. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 2,21,500 ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో దీపావళి వెలుగులు

కార్యక్రమానికి సుమారు 30 వేల మంది ప్రజలు, లబ్ధిదారుల హాజరు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 12(ప్రభాత ఉదయం)

వచ్చే దీపావళి నాటికి హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణాలు పూర్తి చేసి ఎంపిక చేసిన లబ్ధిదారులకు గృహాలు అందజేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.గురువారం మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని మైలార్‌దేవ్‌పల్లిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రా, కేటాయింపుల కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 30 వేల మంది ప్రజలు, లబ్ధిదారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... పేదల సొంతింటి కలను సాకారం చేసి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ ..మిగతా 2లో

ప్రభుత్వ సేవలు ఇక ఇంటి ముంగిటకే!

కార్యాలయాల చుట్టూ తిరిగే కష్టాలకు చెక్.. మీ సేవ "డోర్‌స్టెప్ డెలివరీ" కి శ్రీకారం

1100కు ఫోన్ చేస్తే చాలు.. ఇంటికే వచ్చి సేవలందించే ధ్రువీకరించిన ప్రతినిధులు

బస్సు, మెట్రో టికెట్ల బుకింగ్‌కు మీటికెట్ యాప్.. వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులకు ఊరట

శేరిలింగంపల్లి,నవంబర్ 12 (ప్రభాత ఉదయం)

ప్రభుత్వ కార్యాలయం మెట్లెక్కాల్సిన అవసరం లేదు.. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన పనిలేదు.. చిన్నచిన్న ప్రభుత్వ పనుల కోసం సెలవులు పెట్టుకుని తిరగాల్సిన ఇబ్బందులకూ ఇక స్వస్తి! ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి ముంగిటకే చేర్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'మీ సేవ డోర్‌స్టెప్ డెలివరీ' విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. శిక్షణ పొందిన, ధ్రువీకరించిన ప్రతినిధులే నేరుగా ఇంటికి వచ్చి సేవలు



అందించనుండటంతో ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులు, బయటకు వెళ్లలేని వారికి ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఒక్క ఫోన్ కాల్‌తో ప్రభుత్వ సేవలు ఇంటికే చేరేలా ఈ వినూత్న విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సేవలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ) శాఖ, సైబరాబాద్ పోలీస్,



నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 12(ప్రభాత ఉదయం)

కరోనా నిబంధనల ఉల్లంఘన కేసులో సీఎం రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజరయ్యారు. నాగార్జునసాగర్ ఉప ఎన్నికల ప్రచార సమయంలో కరోనా నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనపై కేసు నమోదైంది. ఆ కేసు విచారణలో భాగంగా గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. అప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి.. 2021 ఏప్రిల్ 11న నల్గొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామంలో నిర్వహించిన ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్కులు ధరించకుండా, తగిన జాగ్రత్తలు తీసుకోకుండా కొవిడ్ నిబంధనలు ఉల్లంఘించినట్లు కేసు నమోదైంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) 313 కింద నిందితుల వాంగ్మూలం నమోదు చేసేందుకు న్యాయస్థానం విచారణ చేపట్టింది.

వచ్చే దీపావళి నాటికి ఇందిరమ్మ టవర్లు పూర్తి చేస్తాం: మంత్రి పొంగులేటి

అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ..

మంత్రులు పొంగులేటి,శ్రీధర్‌బాబుతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



రాజేంద్రనగర్,నవంబర్12 (ప్రభాత ఉదయం)

అర్హులైన పేదలందరి సొంతింటిక సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,తో కలిసి ఇందిరమ్మ టవర్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం మైలార్ దేవ్ పల్లిలో నిర్వహించిన ఇందిరమ్మఇళ్ల లక్కీడ్రా,కేటాయింపుల కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ...హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 23 నియోజకవర్గాల్లో చేపట్టిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణాలను వచ్చే దీపావళి నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు. రాజేంద్రనగర్‌లో చిన్నారి చేతుల మీదుగా లక్కీ డ్రా నిర్వహించి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 2,21,500 ఇందిరమ్మ ఇళ్ల



ప్రపంచ నాణ్యతా దినోత్సవం సందర్భంగా తెలంగాణ పోలీస్ అకాడమీకి మరో అరుదైన గుర్తింపు

"ఐ ఎస్ ఓ నుంచి ప్రతిష్ఠాత్మక "'నాణ్యతా చిహ్నం' సర్టిఫికెట్

దేశంలోనే ప్రత్యేక 5 స్టార్ రేటింగ్ సాధించిన పోలీస్ శిక్షణ సంస్థగా మరో మైలురాయి:

నాలుగు దశాబ్దాల నాణ్యమైన పోలీస్ శిక్షణకు అంతర్జాతీయ ప్రమాణాల గుర్తింపు:::

అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, నాయకత్వంలో నాణ్యతా ప్రమాణాల విస్తరణ

అధికారులు, సిబ్బంది సమష్టి కృషికి దక్కిన గౌరవమిది: డైరెక్టర్ అభిలాష బిస్త్

2లో..



తెలంగాణాలో 21 మంది ఐపీఎస్‌ల బదిలీలు

వీసీ సజ్జనార్‌కు కొత్త పోస్టు

హైదరాబాద్ నూతన సీపీగా మహేష్ భగవత్ నియామకం

ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్ బదిలీ

లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్

పోలీస్ శాఖలో సమూల మార్పులు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

4లో..

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నీటి సరఫరా వ్యవస్థలను పరిశీలించిన

జలమండలి జేఎండీ మయాంక్ మిట్టల్

రాబోయే వేసవిలో తాగునీటి అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 12(ప్రభాత ఉదయం)

మహానగరంలో రాబోయే వేసవిలో ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి లభ్యతపై సవాళ్లు ఎదురయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని జలమండలి ముందస్తు చర్యలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ గురువారం ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలకు సంబంధించిన నీటి సరఫరా వ్యవస్థలను పరిశీలించారు.ఈ సందర్భంగా గండిపేట, హిమాయత్‌సాగర్‌లోని ప్రెజర్ ఫిల్టర్లు, గండిపేటలో ప్రతిపాదించిన అదనపు 10 ఎంఎల్‌డీ సామర్థ్యం గల ప్రెజర్ ఫిల్టర్ల ఏర్పాటు స్థలం, బుద్వేల్‌లోని 3 ఎంఎల్‌డీ ప్రెజర్ ఫిల్టర్లు, పునరుద్ధరించాల్సిన పాత బుద్వేల్ ఫిల్టర్లు, మీర్‌ఆలంలోని నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు.జలాశయాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, నీటి నాణ్యత, ఇన్‌టేక్ వ్యవస్థలు, శుద్ధి కేంద్రాల పనితీరు, ప్రెజర్ ఫిల్టర్ల సామర్థ్యాన్ని సమీక్షించారు. రాబోయే వేసవిలో ఈ జలవనరుల నుంచి అదనపు తాగునీటిని సేకరించి, శుద్ధి చేసి నగరానికి సరఫరా చేసేందుకు చేపట్టాల్సిన అత్యవసర ప్రత్యామ్నాయ పనులపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా జేఎండీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ.. అన్ని నీటి శుద్ధి కేంద్రాలు, ప్రెజర్ ఫిల్టర్లను పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేసేలా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో నీటి రంగులో తలెత్తే మార్పుల వల్ల శుద్ధి ప్రక్రియకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా సాంకేతిక పరిష్కారాలను గుర్తించాలని సూచించారు. అదనపు నీటి సేకరణ, శుద్ధి సామర్థ్యాన్ని పెంచేందుకు



ప్రతిపాదించిన అత్యవసర పనులను వెంటనే ప్రారంభించి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ట్రాన్స్‌మిషన్, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ విభాగాలు సమన్వయంతో పనిచేసి నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.రాబోయే వేసవిలో తాగునీటి డిమాండ్ పెరిగే అవకాశమున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు అదనపు నీటి సరఫరాకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జలమండలి టెక్నికల్ డైరెక్టర్ ప్రభుతో పాటు ట్రాన్స్‌మిషన్, క్యూఏటీ, ఓ అండ్ ఏం విభాగాల అధికారులు ఉన్నారు.

వచ్చే దీపావళి నాటికి ఇందిరమ్మ టవర్లు

పూర్తి చేస్తాం: మంత్రి పొంగులేటి

మొదటి పేజీ తరువాయి...

నిర్మాణం చేపట్టామని తెలిపారు.తదుపరి విడతల్లోనూ అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు.మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం ఆత్మగౌరానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు.కుల,మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని కల్పించే ముఖ్యమైన అవసరమని అన్నారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా సొంత ఇల్లు నిర్మించుకోలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ప్రయోజనకరంగా నిలుస్తుందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఇళ్ల నిర్మాణాలు నాణ్యతతో,వేగంగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు.లబ్ధిదారులు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలను నిజం చేసుకోవాలని ఆకాంక్షించారు.రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు పేదల సంక్షేమానికి తన వంతు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి,జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి,హౌసింగ్ బోర్డు ఎండి గౌతమ్, రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్,పిడి చంపానాయక్ ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఎకరా రూ.250 కోట్ల నుంచి రూ.270 కోట్ల వరకు విలువ చేసే అత్యంత ఖరీదైన భూముల్లో సైతం పేదల కోసం ఇందిరమ్మ టవర్లను నిర్మిస్తున్నామని తెలిపారు. పేదలను నగరానికి దూరంగా పంపకుండా, వారు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే అన్ని మౌలిక సదుపాయాలతో ఇళ్లు నిర్మించి అందించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.ఇందులో భాగంగా హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 23 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టామని, వచ్చే దీపావళి నాటికి నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ, కుల, మత వివక్షకు తావులేకుండా పూర్తిగా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. రాజేంద్రనగర్‌లో చిన్నారి చేతుల మీదుగా లక్కీ డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 2,21,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేద కుటుంబాల్లో దీపావళి వెలుగులు నింపామని మంత్రి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో మొదటి విడతలో ఇళ్లను కేటాయించామని, మొదటి విడతలో ఇళ్లు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రాబోయే రెండు, మూడు, నాలుగు విడతల్లో అర్హులైన ప్రతి



ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఇందిరమ్మ ఇళ్లతో పాటు సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ద్వాక్రా మహిళలకు రూ.73 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు, 4.50 లక్షల మందికి కొత్త ఆసరా పెన్షన్లు అందిస్తూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని వివరించారు. ఈ నెల 19వ తేదీ నుంచి ఆడబిడ్డలకు చీలకపచ్చ రంగు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, ఆత్మగౌరవానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. పేద కుటుంబాలకు వారు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన గృహాలను నిర్మించి అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా నగరానికి దూరంగా కాకుండా, విలువైన భూముల్లోనే పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇళ్లు అందిస్తామని, మొదటి విడతలో ఇల్లు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతూ, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, మహేశ్వరం శాసన సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, రాజేందర్ నగర్ శాసన సభ్యులు ప్రకాష్ గౌడ్, హౌసింగ్ బోర్డు ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, రాజేందర్ నగర్ ఆర్డీఓ శ్రీధర్, పిడి హౌసింగ్ చంప్లా నాయక్, తహశీల్దార్లు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ,మాజీ మేయర్ పారిజాతం, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



22-ఎ నిషేధిత భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే

ప్రభుత్వ లక్ష్యం

మంత్రి పొంగులేటి

హైదరాబాద్, నవంబర్ 12(ప్రభాత ఉదయం)

22-ఎ నిషేధిత భూములకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో సమావేశమయ్యారు. కాగా.. నిషేధిత భూముల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. '22-ఎ నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి. 22-ఎ దరఖాస్తులన్నీ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి. ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదు. పరిష్కారంలో జాప్యం చేస్తే సహించేది లేదు. ఈ మేరకు కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు ప్రత్యేక చొరవ చూపాలి. ప్రతి వారం 22-ఎ భూ సమస్యలపై జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించాలి. పరిష్కారం కాని సమస్యలను ఉన్నతస్థాయి కమిటీకి పంపాలి. యూఎల్‌సీ సమస్యలపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలి. జీవో 59, 76, 118 అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. దాంతోపాటు.. 22-ఎ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు చర్యలు చేపట్టండి. వాటికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించండి. అర్హులైన భూ యజమానులకు త్వరితగతిన న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలి. అయితే.. ప్రభుత్వ భూముల విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించండి' అని మంత్రి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ సేవలు ఇక ఇంటి ముంగిటకే!

మొదటి పేజీ తరువాయి...

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సంయుక్తంగా గురువారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో సమన్వయ కార్యక్రమాన్ని నిర్వహించాయి. వివిధ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు (ఆర్‌డబ్ల్యూఏ), గేటెడ్ కమ్యూనిటీల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన, తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ టి. రవి కిరణ్, హాజరయ్యారు. ఈ సందర్భంగా టి. రవి కిరణ్ మీ సేవ డోర్‌స్టెప్ డెలివరీ విధానం, సేవలు పొందే ప్రక్రియను వివరించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే ఇంటి నుంచే సేవలు పొందేలా ఈ వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 1100 నంబర్‌కు ఫోన్ చేసి 1 నొక్కడం ద్వారా సేవలను కోరవచ్చని, అలాగే https://dsd.meeseva.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.సైబరాబాద్ మూవ్స్‌తో రవాణా సౌకర్యాలపై అవగాహనకార్యక్రమంలో భాగంగా మిస్టర్ నవేద్, శ్రీనివాస్ అలవిల్లి సైబరాబాద్ మూవ్స్ కార్యక్రమంపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. సైబరాబాద్ పరిధిలో సులభతరమైన, మెరుగైన, పర్యావరణహిత రవాణా వ్యవస్థ ఆవశ్యకతను వివరించారు. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి ప్రజా రవాణాను ప్రోత్సహించడం, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ఒకే యాప్‌లో బస్సు, మెట్రో టికెట్లు

ప్రజా రవాణా ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు 'మీటికెట్' యాప్‌ను కూడా ఈ సందర్భంగా పరిచయం చేశారు. ఈ యాప్ ద్వారా సిటీ బస్సులు, మెట్రో రైళ్ల టికెట్లను బుక్ చేసుకోవడంతో పాటు బస్ పాస్‌లకు దరఖాస్తు చేసుకోవడం, రెన్యువల్ చేసుకోవడం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. జూ పార్కులు, ఇతర పార్కుల ప్రవేశ టికెట్లను సైతం యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ సేవలు, డిజిటల్ సౌకర్యాలపై తమ కమ్యూనిటీల్లోని నివాసితులకు వాట్సాప్ గ్రూపులు, అవగాహన పోస్టర్లు, ప్రత్యేక కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులకు సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, డిజిటల్ సౌకర్యాలపై అవగాహన పెంచడం, ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రజల సౌకర్యం, భద్రత, మెరుగైన జీవన ప్రమాణాల కోసం ప్రభుత్వ శాఖలు, పోలీస్ విభాగం, పరిశ్రమలు, నివాస సముదాయాలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు.

ప్రపంచ నాణ్యతా దినోత్సవం సందర్భంగా

తెలంగాణ పోలీస్ అకాడమీకి మరో అరుదైన గుర్తింపు

హైదరాబాద్, నవంబర్ 12(ప్రభాత ఉదయం)

ప్రపంచ నాణ్యతా దినోత్సవం సందర్భంగా తెలంగాణ పోలీస్ అకాడమీ మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపును సాధించింది. శిక్షణ, పచ్చదనం, పరిశుభ్రమైన ఆహారం, పరిపాలన, మౌలిక సదుపాయాలు, వివిధ విభాగాల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ దేశంలోనే అగ్రగామి పోలీస్ శిక్షణ సంస్థగా ఎదిగిన అకాడమీకి ఐ ఎస్ ఓ సంస్థ ప్రతిష్ఠాత్మకమైన'నాణ్యతా చిహ్నం' సర్టిఫికెట్‌ను అందజేసింది. నవంబర్ 10, 2026న ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి లో జరిగిన 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీల శిక్షణ ముగింపు వేడుక సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా, ఐ ఎస్ ఓ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య ఈ సర్టిఫికెట్‌ను అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, కు అందజేశారు.

నాణ్యతా ప్రమాణాలపై వార్షిక ఐ ఎస్ ఓ ఆడిట్

ప్రపంచ నాణ్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని అకాడమీలో నిర్వహించిన వార్షిక నాణ్యతా ఆడిట్‌లో భాగంగా ఐఎస్ ఓ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య, ఐ ఎస్ ఓ లీగల్ అడ్వైజర్ ఫర్ క్వాలిటీ సుందర్ రామయ్య అకాడమీలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

గతంలోనే శిక్షణా ప్రమాణాలు, గ్రీనరీ, పరిశుభ్రమైన ఆహార నిర్వహణ వంటి విభాగాల్లో ఐ ఎస్ ఓ సర్టిఫికేషన్లు సాధించిన అకాడమీ, 2024లో ఐ ఎస్ ఓ నుంచి 5 స్టార్ రేటింగ్‌ను కూడా



పొందింది. దేశంలోని పోలీస్ శిక్షణా సంస్థల్లో ఈ ప్రత్యేక గుర్తింపు అకాడమీకి మరింత ప్రతిష్ఠను తీసుకువచ్చింది.

""""నాణ్యతే మా లక్ష్యం --"""" డైరెక్టర్ అభిలాష బిస్త్,

ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ... తెలంగాణ పోలీస్ అకాడమీ నాలుగు దశాబ్దాలుగా పోలీస్ అధికారులకు అత్యుత్తమ శిక్షణ అందిస్తూ దేశంలోనే ప్రముఖ పోలీస్ శిక్షణా సంస్థగా నిలిచిందని పేర్కొన్నారు.

కాలానుగుణంగా మారుతున్న పోలీసింగ్ అవసరాలు, నేరాల స్వరూపం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా శిక్షణా ప్రమాణాలను నిరంతరం మెరుగుపరుస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.

అకాడమీలో ఇండోర్, ఔట్‌డోర్ శిక్షణతో పాటు పరిపాలన, పరిశుభ్రత, ఆహార భద్రత, పచ్చదనం, క్రీడలు, వైద్య సదుపాయాలు, మౌలిక వసతుల నిర్వహణలో అత్యున్నత



ప్రమాణాలను పాటిస్తున్నామని చెప్పారు.

కాడమీ సాధించిన వివిధ ఉత్తమ అవార్డులు, కేంద్ర హోంశాఖ నుంచి లభించిన గుర్తింపులు, ఐ ఎస్ ఓ సర్టిఫికేషన్లు, 5 స్టార్ రేటింగ్ వెనుక అకాడమీలోని అధికారులు, బోధనా సిబ్బంది, వివిధ విభాగాల ఉద్యోగుల సమష్టి కృషి ఉందని ప్రశంసించారు.

ఈ సందర్భంగా లభించిన 'నాణ్యతా చిహ్నం' గుర్తింపు కూడా ప్రతి ఒక్కరి అంకితభావానికి, బాధ్యతాయుతమైన పనితీరుకు లభించిన గౌరవమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ నాణ్యతా ప్రమాణాలను మరింత పెంచుతూ, దేశంలోనే అత్యుత్తమ పోలీస్ శిక్షణా సంస్థగా అకాడమీ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తామని డైరెక్టర్ తెలిపారు.

అకాడమీలోని అన్ని విభాగాలపై సమగ్ర పరిశీలన ఐ ఎస్ ఓ ప్రతినిధులు నిర్వహించిన ఆడిట్‌లో అకాడమీలోని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, ఎంటి బ్లాక్, తరగతి గదులు, బోధనా సదుపాయాలు, శిక్షణా వసతులు, మెస్‌లో ఆహార పరిశుభ్రత, యూనిట్ హాస్పిటల్, క్రీడాభవన్, బెల్ ఆఫ్ ఆర్మ్, వెపన్స్ వింగ్, శిక్షణా మైదానాలు తదితర విభాగాలను పరిశీలించారు.ప్రతి విభాగంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలు, అందిస్తున్న సేవల వివరాలను ఆయా విభాగాల ఇన్‌చార్జిలు ఐ ఎస్ ఓ ప్రతినిధులకు వివరించారు.

వినూత్నంగా 'క్వాలిటీ హారం' నిర్వహణ

నాణ్యతా దినోత్సవ వేడుకల్లో భాగంగా అకాడమీ ఆధ్వర్యంలో వినూత్నంగా 'క్వాలిటీ హారం' కార్యక్రమాన్ని నిర్వహించారు. అకాడమీ వాహనాలు, బుల్లెట్ మోటార్ సైకిళ్లను ఉపయోగించి ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించడం ఆకట్టుకుంది. నాణ్యత అనేది ఒక్క విభాగానికే పరిమితం కాకుండా సంస్థలోని ప్రతి విభాగం, ప్రతి ఉద్యోగి పనితీరులో ప్రతిబింబించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.అధికారులు, సిబ్బంది భాగస్వామ్యంతో కార్యక్రమంలో ఇండోర్ ఫ్యాకల్టీ డి.ఎస్.పి ఆదూరి శ్రీనివాసరావు, యూనిట్ హాస్పిటల్ డాక్టర్ రమాదేవి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అడ్మిన్ మహేష్, క్వార్టర్ మాస్టర్ శ్రీనివాస్, ఎం టి వింగ్ శ్రీరాజు, ఔట్‌డోర్ విభాగం సిబ్బంది, వివిధ విభాగాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.నాణ్యత, క్రమశిక్షణ, పరిశుభ్రత, సమర్థవంతమైన శిక్షణ -- ఈ నాలుగు అంశాలను ప్రామాణికంగా తీసుకుని ముందుకు సాగుతున్న రాజ బహుదూర్ వెంకట్రాంరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీకి లభించిన 'నాణ్యతా చిహ్నం' గుర్తింపు అకాడమీ అధికారులకు, సిబ్బందికి మరింత స్ఫూర్తినిచ్చే మరో మైలురాయిగా నిలిచింది.

తేజశ్రీకి న్యాయం జరిగేలా న్యాయ విచారణ జరపాలి



అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజ శ్రీ కి మద్దతుగా నిరసన తెలుపుతున్న విద్యార్థులతో శాసనమండలి సభ్యులు ఏ వీ ఎన్ రెడ్డి, అంజి రెడ్డి లు



మాట్లాడుతున్న శాసన మండలి సభ్యులు ఏ వీ ఎన్ రెడ్డి



క్యాంటీన్ నుంచి పరిపాలన భవనం వరకు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు. పాల్గొన్న శాసన మండలి సభ్యులు ఏ వీ ఎన్ రెడ్డి, అంజి రెడ్డి లు

వీసీ వ్యవహారంలో రాజకీయ జోక్యంపై బీజేపీ ఎమ్మెల్సీల ప్రశ్నలు..

బాధితురాలికి, ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, విద్యార్థులకు సంఘీభావం..

రాజేంద్రనగర్,నవంబర్12(ప్రభాత ఉదయం) :

రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజ శ్రీ కి మద్దతుగా ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులకు బీజేపీ ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, అంజిరెడ్డి లు గురువారం సంఘీభావం తెలిపారు. విశ్వవిద్యాలయానికి చేరుకున్న వారు బాధితురాలిని, ఆమెకు మద్దతుగా ఉన్న వారిని కలిసి వారి పోరాటానికి మద్దతు ప్రకటించారు. అనంతరం ఎన్.రెడ్డి, అంజిరెడ్డి,లు క్యాంటీన్ నుంచి పరిపాలన భవనం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్లారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ...తేజస్విని చేసిన ఆరోపణలపై ఇన్ని రోజులు చర్యలు తీసుకోకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. ఫిర్యాదు నమోదు చేయడంలో జాప్యం వెనుక రాజకీయ ప్రభావం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. 10 రోజులుగా కేసు నమోదు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వైస్ ఛాన్సలర్ స్థాయిలో ఉన్న వ్యక్తి ఒక మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో ఫోన్‌లో సంభాషించడం, సందేశాలు పంపడం, వ్యక్తిగతంగా తన గదికి పిలిపించుకోవాల్సిన అవసరమేంటని ప్రశ్నిస్తూ,ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులు కుటుంబ పరిస్థితులు, పిల్లలు,సామాజిక గౌరవం, పరువు ప్రతిష్ఠలను దృష్టిలో ఉంచుకుని వేధింపులపై వెంటనే బయటకు వచ్చి మాట్లాడలేరని, భరించలేని స్థితికి చేరుకున్నప్పుడే తమ బాధను వెల్లడిస్తారని పేర్కొన్నారు. తేజ శ్రీ ఆరోపణలు నిజమా, అబద్ధమా అనేది ముందుగానే నిర్ణయించకుండా నిష్పక్షపాత విచారణ ద్వారా వాస్తవాలను వెలికితీయాలని స్పష్టం చేశారు. గవర్నర్ విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా తన పరిధిలో చట్టబద్ధమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, ఆయన స్పందనతోనే విచారణ కమిటీ ఏర్పాటు జరిగిందని పేర్కొన్నారు.విశ్వవిద్యాలయాల్లో గతంలో ఉన్న విద్యా ప్రమాణాలు,క్రమశిక్షణ,గౌరవప్రదమైన వాతావరణం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఈ వివాదం కేవలం వీసీ,అసిస్టెంట్ ప్రొఫెసర్ మధ్య వ్యక్తిగత అంశం కాదని,దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన వ్యవసాయ విశ్వవిద్యాలయం పేరు,ప్రతిష్ఠకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు.అందువల్ల ప్రభుత్వ ప్రభావానికి తావులేకుండా న్యాయ విచారణ జరిపించి నిజానిజాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.అవసరమైతే ముఖ్యమంత్రి, గవర్నర్‌ను కలిసి జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని తీసుకెళ్తామని ఎమ్మెల్సీలు తెలిపారు.

అమీన్‌పూర్ వాసుల దశాబ్దాల కల సాకారం దిశగా అడుగులు

లింగంపల్లి నాలా బ్రిడ్జి పనులను పరిశీలించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు

పటాన్ చెరు నవంబర్ 12(ప్రభాత ఉదయం):





అమీన్పూర్ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రహదారి సౌకర్యం సాకారం దిశగా అడుగులు పడుతున్నాయని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు అన్నారు.లింగంపల్లి నాలాపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను గురువారం ఎంపీ రఘునందన్ రావు పరిశీలించారు. జాతీయ రహదారి నుంచి నాలాపై నిర్మిస్తున్న బ్రిడ్జి మీదుగా అమీన్పూర్‌కు నేరుగా రహదారి సౌకర్యం అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే అమీన్పూర్ ప్రజలకు ప్రయాణ సమయం తగ్గడంతో పాటు, ఈ ప్రాంతంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు.అదేవిధంగా బంధంకొమ్ము వద్ద రహదారి నిర్మాణానికి సంబంధించి ఎదురవుతున్న సమస్యలను కూడా పరిష్కరించామని, అక్కడ సైతం త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజల దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, అమీన్పూర్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎంపీ స్పష్టం చేశారు.దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఈ రహదారి సౌకర్యం అందుబాటులోకి రావడం ద్వారా అమీన్పూర్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.

వైస్ ఛాన్సలర్ జానయ్యను విచారణ సమయంలో పదవి నుండి తప్పించాలి

విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ,ఎస్టీ సంఘం నేత మేడి రమేష్

బాధిత మహిళ ప్రొఫెసర్‌కు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

రాజేంద్రనగర్,నవంబర్12(ప్రభాత ఉదయం)

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నెలకొన్న వివాదానికి తెరదించాలంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న వైస్ ఛాన్సలర్ తన అధికారాల నుంచి తాత్కాలికంగా తప్పుకొని సెలవుపై వెళ్లాలని విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ,ఎస్టీ సంఘం సెక్రటరీ జనరల్ మేడి రమేష్ డిమాండ్ చేశారు.అప్పుడే విచారణ ఎలాంటి ప్రభావం లేకుండా నిష్పక్షపాతంగా,పారదర్శకంగా కొనసాగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.గురువారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయ ధర్నా చౌక్ వద్ద బాధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజస్వినికి మద్దతుగా విద్యార్థులు,ఉద్యోగులు చేపట్టిన ఆందోళనలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైస్ ఛాన్సలర్‌పై వచ్చిన ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి విచారణ కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతించారు.కమిటీ ఎవరి ప్రభావానికీ లోనుకాకుండా వాస్తవాలను వెలికితీసి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.అధికార యంత్రాంగం, పోలీసు వ్యవస్థపై ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి ప్రభావం ఉండకూడదని,విచారణ స్వేచ్ఛగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థలో పారదర్శకతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఇలాంటి పరిణామాలు ప్రభుత్వానికి అప్రతిష్ఠ కలిగించకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.విశ్వవిద్యాలయంలో విద్యార్థులు,ప్రొఫెసర్లు,ఉద్యోగులు ప్రశాంతమైన విద్యా వాతావరణంలో పనిచేసే పరిస్థితులు కల్పించాలని,సంస్థ ప్రతిష్ఠను కాపాడేలా అధికారులు వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టాసా అధ్యక్షుడు పవన్ చంద్రరెడ్డి,ప్రధాన కార్యదర్శి సౌజన్య,ఉపాధ్యక్షుడు కమలాకర్,సహాయ కార్యదర్శి పరమేష్,బోధనేతర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.జయరాం,గౌరవ అధ్యక్షుడు రాజు,విద్యార్థి నాయకుడు రాజకుమార్, విద్యుత్ ఉద్యోగ సంఘం ప్రతినిధులు కృష్ణ, సురేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





సంఘీభావం తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగుల సంఘం నేత మేడి రమేష్

సేవకులు నమ్మకంగా ఉంటే ఆశీర్వదింపబడుతారు: రెవరెండ్ ఎం యేసుపాల్



బైబిల్ సందేశాలను వివరిస్తున్న రెవరెండ్ ఎం యేసుపాల్



దైవ సేవకురాలు ఎస్ యేసుమణి జన్మదినం సందర్భంగా ఆమెచేత కేక్ కట్ చేయిస్తున్న సంఘ సభ్యులు



దైవ సేవకురాలు ఎస్ యేసుమణి కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సిస్టర్ బాల, సిస్టర్ మాధవి లు



ఆదీవల బిషప్‌గా అభిషేకం పొందిన దైవ సేవకురాలు ఎస్ యేసుమణి

బిషప్ గా అభిషేకం పొందిన దైవ సేవకురాలు ఎస్ యేసుమణి జన్మదినం సందర్భంగా కోనేటి ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థన సమావేశం

బుద్వేల్, నవంబరు 12 (ప్రభాత ఉదయం) :

దేవుని సేవ చేస్తున్న సేవకులు నమ్మకంగా ఉండాలని, అప్పుడు దేవుడు ఎంతగానో దీవిస్తాడని సంగారెడ్డి రాక్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ ఎం యేసుపాల్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ క్రీస్తు గుట్ట లో గల కోనేటి ప్రార్థన మందిరంలో గురువారం దైవ సేవకురాలు ఎస్ యేసుమణి బిషప్ గా అభిషేకం పొందిన సందర్భం, ఆమె జన్మదినం సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేవుని సేవ చేస్తున్న వారు సామాన్యమైన వ్యక్తులు కాదని, అసాధారణమైన వారన్నారు. అనేకులను వెలుగులోకి తీసుకురావడానికి పని చేయాలన్నారు. సేవకులైన వారు పరలోక రాజ్యంలో క్యాబినెట్ మంత్రుల వంటి వారని గుర్తు చేశారు. సేవకులందరు కలసి ఉండటం ఆశీర్వాదకరమన్నారు. విశ్వవ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సంఘాలన్ని ఒక్కటేనని గుర్తు చేశారు. సంఘంలో సేవకులు నమ్మకంగా ఉంటే ఆ ప్రాంతాన్ని, అక్కడి నాయకులను, అధికారులను దేవుడు వారికి అప్పచెప్తాడన్నారు. నమ్మకం గా ఉండి దీవెనలు పొందిన వారు బైబిల్ లో అనేకమంది ఉన్నారని, వారిలో యోసేపు, దావీదు, హన్నా, పేతురు ఆండ్రేయ లాంటి వారు అనేకులు ఉన్నారన్నారు. సమూయేలు న్యాయాధి పతిగా మారడానికి ఏలీ దగ్గర నమ్మకమైన దాసునిగా ఉండడమే అని గుర్తు చేశారు.

బిషప్ ఎస్ యేసుమణి జన్మదిన వేడుకలు :

బిషప్ ఎస్ యేసుమణి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి . సేవకుల సమక్షంలో ఆమె కేక్ కట్ చేశారు. తన పుట్టిన రోజు సందర్భంగా చర్చ్ లో జరిగిన ప్రార్థన సమావేశానికి వచ్చి వాక్యం చెప్పిన రెవరెండ్ ఎం యేసుపాల్, రెవరెండ్ కె సుందర్ పాల్, సమావేశానికి అధ్యక్షత వహించిన రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్ తో పాటు రాజేంద్రనగర్ మండలం దైవ సేవకులను, సేవకురాళ్ళను శాలువాలతో సన్మానించారు. సమావేశంలో క్రైస్తవ నాయకులు బ్రదర్ రఘుముద్రి పీటర్ నాయుడు, రెవరెండ్ కరుణ్ పాస్టర్లు ప్రణీత్ బాబు, ప్రమోద్, విజయ్ కుమార్, యేసు రత్నం, బ్రదర్ రాజ్ కుమార్ ఇశ్రాయేల్, బ్రదర్ జాషువా, బ్రదర్ జాన్ వెస్లీ తో పాటు పలువురు దైవ సేవకులు , కోనేటి ప్రార్థన మందిరం సభ్యులు పాల్గొన్నారు.



టాసా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సల్లా సౌజన్య ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

తొమ్మిది నెలల శిశువుకు పాలివ్వకుండా అరెస్ట్ చేస్తారా.?

వ్యవసాయ వర్సిటీలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం..

ముందస్తు అరెస్టులతో ఉద్రిక్తత.. మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సల్లా సౌజన్య ఆవేదన..

రాజేంద్రనగర్,నవంబర్12(ప్రభాత ఉదయం)



పోలీసులు అరెస్ట్ చేసిన డాక్టర్ సల్లా సౌజన్య , నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ టెక్నికల్ కార్యదర్శి సులోచన

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న వివాదం గురువారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. ఒకవైపు బాధిత మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు మద్దతుగా ఉద్యోగులు,విద్యార్థులు ఆందోళన కొనసాగిస్తుండగా, మరోవైపు వైస్ ఛాన్సలర్‌కు మద్దతుగా ఉద్యోగ సంఘాలు ధర్నాకు దిగడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో పోలీసులు ఇరుపక్షాల ఆందోళనకారులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని వేర్వేరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రాంగణం లో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్ష చేపట్టిన ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు పోలీసుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు.

వీసీ కి మద్దతుగా....

వీసీకి మద్దతుగా మరో వర్గం ఉద్యోగ సంఘాలు ధర్నా నిర్వహించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ప్రయత్నించినప్పటికీ ఉద్రిక్తత కొనసాగడంతో ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సల్లా సౌజన్య మాట్లాడుతూ...బాధిత మహిళకు న్యాయం చేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమను అనుమతి లేదనే కారణంతో అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.తనకు తొమ్మిది నెలల శిశువు ఉందని, పాపకు పాలు ఇచ్చే అవకాశం కూడా లేకుండా తనను కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.కనీసం చంటి బిడ్డ తల్లిననే మానవత్వం కూడా చూపలేదని ఆమె ఆరోపించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో టాసా అధ్యక్షుడు డాక్టర్ కె పవన్ చంద్రా రెడ్డి, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ టెక్నికల్ కార్యదర్శి సులోచన, టాసా ఉపాధ్యక్షుడు డాక్టర్ జె కమలాకర్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జి.పరమేష్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయ కోర్సుల్లో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్..ఈ నెల14నుంచి ప్రారంభం..

రాజేంద్రనగర్,నవంబర్12(ప్రభాత ఉదయం)

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాలలలో బీఎస్సీ(ఆనర్స్)అగ్రికల్చర్,బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో రెగ్యులర్ కోటాలో మిగిలి పోయిన సీట్లకి శనివారం(నవంబర్14వ తేదీ)ఉదయం చివరి మాప్ అప్ కౌన్సిలింగ్ ని నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఇ.సిహెచ్ విద్యాసాగర్ వెల్లడించారుఅదే రోజు మధ్యాహ్నం ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ ప్రాయోజిత కోటా సీట్లకి,కౌన్సిలింగ్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.పూర్తి వివరాలు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ ఽఽఽ.జూఌఐబ.వఽబ.అఅ.లో చూడవలసిందిగా రిజిస్ట్రార్ సూచించారు.

అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ అల్డాస్ జానయ్యపై వచ్చిన ఆరోపణలపై విచారణకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆదేశాలు..

ఐదుగురుతో కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు..

15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశం..

రాజేంద్రనగర్,నవంబర్12(ప్రభాత ఉదయం) :

మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజ శ్రీ పై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్డాస్ జానయ్య వేధింపులకు పాల్పడ్డంటూ వచ్చిన ఆరోపణలపై నిరసనలు జరుగుతున్నాయి. వీసీ అల్డాస్ జానయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే తోటి ప్రొఫెసర్లు, యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు ఆందోళన చేపట్టారు. మరోవైపు వీసీ అల్డాస్ జానయ్యకు తెలంగాణరాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు కూడా జారీ చేసింది. ఈ క్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్యపై విచారణకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆదేశాలు జారీ చేశారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వీసీ అల్డాస్ జానయ్య వ్యవహారంపై విచారణకు ఐదుగురు సభ్యులతో కమిటీ వేసింది. గిడ్డంగుల సంస్థ ఎండీ కె లక్ష్మి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయగా అందులో ఐ ఏ ఎస్ అధికారులు గోపి, సహకార సంఘాల రిజిస్ట్రార్ రాహుల్ రాజ్, హార్టికల్చర్ విభాగం డైరెక్టర్ డాక్టర్ యాస్మిన్ బాషా, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీత కృష్ణన్ సభ్యులుగా ఉన్నారు.15 రోజుల్లో పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వం కమిటీకి ఆదేశాలు జారీ చేసింది.

ఖబడ్దార్ కేటీఆర్! తప్పుడు రాతలతో నిజాన్ని దాచలేరు!

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్, 12 (ప్రభాత ఉదయం):



తమపై నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురించిన తప్పుడు కథనాలపై న్యాయ పోరాటానికి సిద్ధమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.పత్రిక యాజమాన్యంతో పాటు కేసీఆర్, కేటీఆర్‌ల పాత్రలపై ఆధారాలు సేకరించి పరువు నష్టం దావాకు న్యాయపరమైన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ప్రజాబలాన్ని తప్పుడు రాతలతో అడ్డుకోలేరని బురదజల్లే రాజకీయాలకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. ఇలాంటి వారికి సమయం చూసి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు .

జగిత్యాలలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్.. 150 వాహనాలు సీజ్





ఉమ్మడి కరీంనగర్ జిల్లాప్రతినిధి, జగిత్యాల, నవంబర్, 12 (ప్రభాత ఉదయం):

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్లు, అస్సలు నంబర్ ప్లేట్ లేని వాహనాలపై జగిత్యాల ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ సీఐ పి. కరుణాకర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్, సిబ్బంది పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన 150 వాహనాలను అదుపులోకి తీసుకుని, చలాన్లు విధించారు. అనంతరం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసుల సూచనలతో వాహనదారులు తమ వాహనాలకు వెంటనే ప్రమాణాల ప్రకారం కొత్త నంబర్ ప్లేట్లను అమర్చుకున్నారు. ఈ సందర్భంగా సీఐ కరుణాకర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మోటార్ వాహనాల చట్టం ప్రకారం ప్రామాణిక నంబర్ ప్లేట్లను మాత్రమే వాడాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.



నూతనంగా ఎన్నికైన నాయకులను సన్మానిస్తున్న రవికుమార్ యాదవ్..

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి: రవికుమార్ యాదవ్

ఎస్టీ మోర్చా నూతన బాధ్యులకు సన్మానం

శేరిలింగంపల్లి,నవంబర్ 12, (ప్రభాత ఉదయం)

భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతమే ధ్యేయంగా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జగదీష్ నాయక్, కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన రాయుడు నాయక్ మర్యాదపూర్వకంగా రవికుమార్ యాదవ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన నాయకులను రవికుమార్ యాదవ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం, గుర్తింపు లభిస్తాయనడానికి వీరి నియామకాలే నిదర్శనమన్నారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీని మరింత పటిష్టం చేయాలని సూచించారు. తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తామని శేరిలింగంపల్లి నియోజకవర్గంతో పాటు రంగారెడ్డి అర్బన్ జిల్లా వ్యాప్తంగా బీజేపీ విజయానికి సైనికుల్లా పనిచేస్తామని నూతన నాయకులు జగదీష్ నాయక్, రాయుడు నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు హనుమంత్ నాయక్ పాల్గొన్నారు.



మద్యం సేవించి వాహనం నడిపిన నిందితులు..

మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే జైలు శిక్ష తప్పదు!

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఐదుగురికి జైలు.. మరో ముగ్గురికి జరిమానా

శేరిలింగంపల్లి : నవంబర్ 12, (ప్రభాత ఉదయం)

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ న్యాయస్థానం మరోసారి స్పష్టం చేసింది. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ఐదుగురికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఎనిమిది కేసులను న్యాయ స్థానంలో విచారించి పరిష్కరించారు. మేడ్చల్‌లోని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కమ్ 8వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయ స్థానంలో ఈ కేసుల విచారణ జరిగింది. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన రెండు కేసుల్లో నిందితులకు కలిపి రూ.2 వేల జరిమానా విధించారు. అదేవిధంగా, మద్యం సేవించి వాహనాలు నడిపిన ఆరు కేసుల్లో రూ.4,500 జరిమానా విధించడంతో పాటు ఐదుగురికి జైలు శిక్ష ఖరారు చేశారు. ఇందులో ఒకరికి 10 రోజుల జైలు శిక్ష, మరో నలుగురికి నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు కీలక హెచ్చరిక జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, తప్పనిసరిగా చెల్లుబాటయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వాహనదారుల నిర్లక్ష్యం వారి ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. మద్యం మత్తులో స్టీరింగ్ పట్టుకుంటే జైలు ఊచలు లెక్కించాల్సిందేనని ఈ తీర్పు వాహనదారులకు గట్టి హెచ్చరికగా మారింది.

సమాజ సేవలో విశేష కృషికి చావా అరుణకు సమతామూర్తి పురస్కారం!

యతేంద్ర సప్తతి మహోత్సవాల్లో ఘనంగా సత్కరించిన చిన్న జీయర్ స్వామి

జాతీయ స్థాయి సేవా పురస్కారాల ప్రదానం

శేరిలింగంపల్లి : నవంబర్ 12, (ప్రభాత ఉదయం)




చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అరుణ..

సమాజ అభ్యున్నతికి, సేవా కార్యక్రమాల ద్వారా విశేష కృషి చేస్తున్న డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ వ్యవస్థాపకురాలు చావా అరుణకు అరుదైన గౌరవం లభించింది. రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ (సమతామూర్తి) క్షేత్రంలో నిర్వహిస్తున్న యతేంద్ర సప్తతి మహోత్సవాల్లో భాగంగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి ఆమెను ఘనంగా సత్కరించి పురస్కారం, ప్రశంసాపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో విశిష్ట సామాజిక సేవలు అందిస్తున్న మహిళా సాధకులు, దేశ రక్షణలో సేవలందిస్తున్న సైనికులు, శాస్త్రవేత్తలను చిన్న జీయర్ స్వామి శాలువాలతో సత్కరించి పురస్కారాలు ప్రదానం చేశారు. సమాజ సేవలో చావా అరుణ చేస్తున్న కృషిని స్వామి ప్రత్యేకంగా అభినందించారు. ఈ మహోత్సవాల్లో చావా అరుణతో పాటు డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీకి చెందిన విద్యార్థులు కూడా పాల్గొని అవార్డులు అందుకున్నారు. అనంతరం వారంతా సమతామూర్తిని దర్శించుకుని చిన్న జీయర్ స్వామి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ సభ్యులు, విద్యార్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పరిశోధనలో నైతికత, జవాబుదారీతనం అవశ్యం

గీతమ్ వర్చువల్ సదస్సులో అసోసియేట్ రీసెర్చ్ ఇంటిగ్రిటీ అనలిస్ట్ సౌమ్య నాయర్

పటాన్ చెరు, నవంబర్ 12(ప్రభాత ఉదయం):



వేగంగా విస్తరిస్తున్న భారత పరిశోధన రంగంలో నైతికత, బాధ్యతాయుతమైన ప్రచురణ, సంస్థాగత జవాబుదారీతనం అత్యంత కీలకమని అసోసియేట్ రీసెర్చ్ ఇంటిగ్రిటీ అనలిస్ట్ సౌమ్య నాయర్ స్పష్టం చేశారు.భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయ సహకారంతో, స్ప్రింగర్ నేచర్ తన 'రైజ్-ఉత్థాన్' కార్యక్రమంలో భాగంగా గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'పరిశోధన సమగ్రత'పై వర్చువల్ ముఖాముఖి నిర్వహించింది. గీతమ్‌ను కీలక సంస్థాగత భాగస్వామిగా గుర్తిస్తూ ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సౌమ్య నాయర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో విశ్వసనీయతను పెంచుకోవాలంటే పరిశోధన శ్రేష్ఠతతో పాటు పారదర్శకత, సమగ్రత ఉండాలని ఉద్ఘాటించారు. పరిశోధన రంగంలో ఎదురవుతున్న పేపర్ మిల్లులు, దోపిడీ ప్రచురణలు, పరిశోధన దుష్ప్రవర్తన వంటి సవాళ్లను ఆమె ప్రస్తావించారు. ఓపెన్ యాక్సెస్, ఓపెన్ సైన్స్ పద్ధతులను అనుసరిస్తూ, పరిశోధన సమగ్రతను విద్యా నైపుణ్యానికి మూలస్తంభంగా మార్చుకోవాలని విద్యాసంస్థలకు సూచించారు.గీతం పరిశోధన, అభివృద్ధి సంచాలకులు ప్రొఫెసర్ రామగోపాల్ నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



ఇందిరమ్మ ఇళ్లతో పేదల ఇంట సంతోషం.. అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

నూతన గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

మిడ్జిల్, నవంబర్ 12(ప్రభాత ఉదయం)

పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపుతోందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. మిడ్జిల్ మండలం వస్పుల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను గురువారం ఆయన ఘనంగా ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా శాశ్వత గృహవసతి కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు నాణ్యతతో కూడిన ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు.ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు మరింత చేరువవుతున్నాయని పేర్కొన్నారు. రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, అర్హులైన వారికే అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో వస్పుల గ్రామంలో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు, గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణాలో 21 మంది ఐపీఎస్‌ల బదిలీలు

హైదరాబాద్, నవంబర్ 12(ప్రభాత ఉదయం)

తెలంగాణ పోలీస్ శాఖలో భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 21 మంది సీనియర్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారికంగా ఉత్తర్వులు (+ూ ₹ చీశీ. 1654) జారీ చేశారు. లా అండ్ ఆర్డర్, ఏసీబీ, సీఐడీ, మహిళా భద్రత, ట్రాఫిక్ విభాగాల్లో సమూల మార్పులు చేస్తూ పోస్టింగ్‌లు కేటాయించారు. ఈ బదిలీల్లో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు కొత్త సారథి వచ్చారు. ఇప్పటివరకు డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా ఉన్న మహేశ్ మురళీధర్ భగవత్‌ను హైదరాబాద్ సీపీగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా (డీజీ) బదిలీ చేశారు. ఆయనకు అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) డీజీ బాధ్యతలను కూడా అప్పగించారు. అలాగే రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్ నియమితులయ్యారు. ఆయనకు కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ విభాగాల బాధ్యతలను కూడా ప్రభుత్వం కేటాయించింది.



ఈనెల 18నలక్ష మందితో బీజేపీ మహా పాదయాత్ర

బిజెపి మహా పాదయాత్రకు హాజరుకానున్న జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్, 12 (ప్రభాత ఉదయం):

కరీంనగర్ రాజకీయ వేదికగా భారతీయ జనతా పార్టీ భారీ కార్యక్రమానికి సిద్ధమవుతోంది. ఈ నెల 18న నగరంలో నిర్వహించనున్న మహా పాదయాత్రను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పార్టీ నాయకత్వం లక్ష మందికి పైగా జనసమీకరణ లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తోంది.బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఈ కార్యక్రమానికి హాజరుకానుండటంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా కరీంనగర్‌కు వస్తుండటంతో ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు రాష్ట్ర, జిల్లా నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం పాదయాత్రకే పరిమితం కాకుండా పార్టీ బలాన్ని, ప్రజల్లో తమకు ఉన్న ఆదరణను చాటిచెప్పేలా భారీ కార్యక్రమంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది.మహా పాదయాత్రకు జనసమీకరణ బాధ్యతలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే పార్టీ ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ ఏర్పాట్లపై సమీక్షిస్తున్నారు.పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీతో సమావేశమైన ఆయన అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలను పెద్ద సంఖ్యలో తరలించేలా దిశానిర్దేశం చేశారు. గ్రామాలు, మండలాలు, పట్టణాల వారీగా జనసమీకరణకు బాధ్యతలు అప్పగిస్తూ రవాణా, ప్రచారం, ర్యాలీ నిర్వహణ ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. మరోవైపు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై విపక్షాలు చేస్తున్న ప్రచారానికి సమాధానం చెప్పడం, ఈ అంశంపై ప్రజలకు తమ వాదనను వివరించడం కూడా పాదయాత్ర ప్రధాన ఉద్దేశమని బండి సంజయ్ వెల్లడించారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు విపక్షాల ఆరోపణలను తిప్పికొట్టేలా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు.నగరంలోని గాంధీ సర్కిల్, వైశ్య భవన్ ప్రాంతం నుంచి ప్రారంభమయ్యే మహా పాదయాత్ర టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌తో పాటు పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొననున్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లు, రహదారులపై పార్టీ జెండాలు, బ్యానర్లు, స్వాగత ఏర్పాట్లతో పాదయాత్రకు ప్రత్యేక వాతావరణం కల్పించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కరీంనగర్‌కు జాతీయ స్థాయి నాయకత్వం రానుండటంతో ఈ కార్యక్రమంపై రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తి నెలకొంది.రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్న తరుణంలో బీజేపీ లక్ష మందితో పాదయాత్ర నిర్వహించాలనే లక్ష్యాన్ని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. నవంబర్ 18న జరిగే ఈ కార్యక్రమానికి ఎంతమంది హాజరవుతారు? జాతీయ అధ్యక్షుడి పర్యటన ద్వారా పార్టీ ఎలాంటి రాజకీయ సందేశాన్ని ఇవ్వనుంది? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



పట్టాదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్, 12 (ప్రభాత ఉదయం):

భూముల రీ సర్వేలో పట్టాదారులకు న్యాయం చేయడమే ప్రధాన లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది.భూముల కొలతలు, హద్దుల నిర్ధారణతో సరిపెట్టకుండా.. సర్వేలో వెలుగుచూసే ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జిల్లాలోని 70 రెవెన్యూ గ్రామాల్లో దశలవారీగా రీ సర్వే చేపడుతుండగా, అభ్యంతరాల స్వీకరణ సమయంలో ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు నేరుగా గ్రామాల్లో పర్యటించి పట్టాదారుల సమస్యలను పరిశీలించనున్నారు. భూ విస్తీర్ణంలో తేడాలు, సరిహద్దుల వివాదాలు, రెవెన్యూ రికార్డుల్లోని లోపాలపై విచారణ జరిపి పరిష్కారం చూపాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.జిల్లాలో ఇప్పటికే 27 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 21,114.29 ఎకరాల్లో సర్వే పూర్తయింది. మిగిలిన పనులను వేగవంతం చేసి తదుపరి దశలో 9(2) నోటీసులు జారీ చేసే స్థాయికి తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. మరో 27 గ్రామాల్లో సర్వే ప్రారంభించేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్లతో కొత్త బృందాలను ఏర్పాటు చేయనున్నారు. వచ్చే వారంలో అదనంగా 10 రోవర్లు అందుబాటులోకి రానుండటంతో సర్వే పనులు మరింత వేగం పుంజుకోనున్నాయిరీ సర్వేలో భూమి విస్తీర్ణం తక్కువగా లేదా ఎక్కువగా నమోదైనా, సరిహద్దుల విషయంలో వివాదాలు తలెత్తినా పట్టాదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యంతరాల దశలోనే అధికారులు గ్రామాలకు వెళ్లి సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియపై ప్రజలకు ముందస్తు సమాచారం అందించేందుకు డప్పు చాటింపు నిర్వహించాలని, అవసరమైన చోట ఫ్లాగ్ పోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, సర్వే పురోగతిని ఎప్పటికప్పుడు పత్రికల ద్వారా వెల్లడించాలని పేర్కొన్నారు.రీ సర్వే పనుల్లో కీలకంగా వ్యవహరిస్తున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రతి 15 రోజులకు ఒకసారి పారితోషికం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది భద్రతకు ప్రాధాన్యమిస్తూ పాముకాటు వంటి ప్రమాదాల నుంచి రక్షణ కల్పించే సేఫ్టీ బూట్లు అందించినట్లు తెలిపారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ పట్టాదారులకు ఇబ్బందులు కలగకుండా రీ సర్వే పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.మరోవైపు జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత నిర్మాణానికి లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ పూర్తయింది. హుజూరాబాద్, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గాల్లో అర్హులను గుర్తించడంతోపాటు ప్రొసీడింగ్స్ తయారీ చేపట్టారు.ఇప్పటివరకు 50 శాతం ప్రక్రియ పూర్తికాగా, మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. త్వరలో సంబంధిత ఎమ్మెల్యేల చేతుల మీదుగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేయనున్నారు. అనంతరం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

అక్టోబర్‌లో కూల్చివేత.. నవంబర్‌లో నిర్మాణం!

బొల్లారం బాలాజీ నగర్‌లో బరితెగించి అక్రమ నిర్మాణం

పర్యవేక్షణ గాలికొదిలేసిన సీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం

అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం.. భారీగా చేతులు మారిన ముడుపులు?





అక్టోబర్ లో ఇలా



నవంబర్ లో ఇలా

పటాన్ చెరు, నవంబర్ 11 (ప్రభాత ఉదయం):

అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే అక్రమార్కులు ఎంతలా బరితెగిస్తారో చెప్పేందుకు ఈ ఘటనే నిదర్శనం. నిబంధనలను తుంగలో తొక్కి నిర్మించారని గడిచిన అక్టోబర్ నెలలో స్వయంగా అధికారులే కూల్చివేసిన ఓ అక్రమ నిర్మాణం.. సరిగ్గా నెల తిరిగేసరికి అదే స్థలంలో తిరిగి దర్శనమిస్తోంది! కూల్చడం తమ పని.. మళ్లీ కట్టుకోవడం వారి హక్కు అన్న చందంగా సిఎంసి బొల్లారం 272 డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో అక్రమ నిర్మాణం పునఃప్రారంభమై పూర్తి కావొస్తున్నా అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పర్యవేక్షణ శూన్యం.. చర్యలు నామమాత్రం!చ


విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బొల్లారం బాలాజీ నగర్‌లో అనుమతులకు మించి నిర్మిస్తున్న ఓ ఇంటిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో గత అక్టోబర్ నెలలో సీఎంసీ సిటీ ప్లానింగ్ అధికారులు హడావుడిగా రంగంలోకి దిగారు. పలు యంత్రాల సహాయంతో స్లాబ్ పాక్షికంగా కూల్చివేసి ఫొటోలు దిగి చేతులు దులుపుకున్నారు. అయితే, ఆ తర్వాత అక్కడ ఏం జరుగుతుందనే దానిపై కనీస నిఘా గానీ, పర్యవేక్షణ గానీ పెట్టలేదు.దీనిని అలుసుగా తీసుకున్న సదరు అక్రమ నిర్మాణదారుడు కూల్చివేతలు జరిగిన కొద్దిరోజులకే ఎంచక్కా తిరిగి నిర్మాణ పనులను వేగవంతం చేశాడు. అక్టోబర్‌లో కూల్చివేతలు జరిగిన మూడవ అంతస్తులో నవంబర్ నాటికి మళ్లీ గోడలు లేచి నిర్మాణం చివరి దశకు చేరుకుంది. ఇంత జరుగుతున్నా సంబంధిత ఏరియా వార్డు అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం.

చేతులు మారిన 'ముడుపులు'.. అందుకే మినహాయింపులు ?

కూల్చివేతల పేరుతో చేసే హడావుడి కేవలం ప్రజా వ్యతిరేకతను తప్పించుకోవడానికేనా? లేక రేట్లు పెంచుకోవడానికేనా? అన్న అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. కూల్చివేత అనంతరం మళ్లీ యథేచ్ఛగా నిర్మాణం జరుగుతోందంటే కిందిస్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకు భారీగా ముడుపులు ముట్టాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "మేము కష్టపడి వేల రూపాయల ఫీజులు చెల్లించి అనుమతులు తెచ్చుకుంటే, అనుమతులు లేనివారు ముడుపులు చెల్లించి దర్జాగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు" అని స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందించేనా?

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని నిత్యం ప్రకటనలు గుప్పించే ఉన్నతాధికారులు.. క్షేత్రస్థాయిలో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రదర్శిస్తున్న ఈ నిర్లక్ష్యంపై ఏం సమాధానం చెబుతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, అనుమతికి మించి సాగుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయడంతో పాటు, పర్యవేక్షణ లోపానికి బాధ్యులైన అధికారులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ఆయుధాలతో దాడి కేసులో ఆరుగురికి ఐదేళ్ల జైలు

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 12(ప్రభాత ఉదయం):

ఆయుధాలతో దాడి చేసి వ్యక్తులను గాయపరిచిన కేసులో ఆరుగురు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.8 వేల జరిమానా విధిస్తూ గద్వాల ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఏ. నాగరాజు తీర్పు వెల్లడించినట్లు గురువారం జిల్లా ఎస్పీ టీ.శ్రీనివాసరావు పేర్కొన్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. 2022 ఫిబ్రవరి 28న గద్వాల మండలం ముల్కలపల్లికి చెందిన తెలుగు శ్రీనివాసులుపై భూ వివాదం నేపథ్యంలో అమరచింతకు చెందిన కొందరు కార్లలో వచ్చి కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనపై గద్వాల రూరల్ పోలీసులు 17 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు.విచారణలో భాగంగా పోలీసులు సాక్షులను పకడ్బందీగా కోర్టులో ప్రవేశపెట్టడంతో న్యాయమూర్తి ఆరుగురికి ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.8 వేల జరిమానా విధించారు. మిగతా 11 మందిపై కేసును కొట్టివేశారు.నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఐపీఎస్ అభినందించారు. ఈ కేసులో డీఎస్పీ మొగిలయ్య, సీఐ శ్రీను, ఎస్సైలు ఆనంద్, శ్రీకాంత్, అడిషనల్ పీపీ సుగుణాదేవి తదితరులు కీలకంగా వ్యవహరించారు.



గల్లంతైన మత్స్యకారుడు మృతదేహం లభ్యం

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 12(ప్రభాత ఉదయం):



ధరూర్ మండలం సంగాల రిజర్వాయర్ లో చేపల వేటకు వెళ్లి గల్లంతైన వెంకటేష్ (23) మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులు, ధరూర్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి...గద్వాల పట్టణం తెలుగు పేటకు చెందిన తెలుగు పద్మావతి నర్సింహుల దంపతుల రెండవ కుమారుడు వెంకటేష్(23) బుధవారం సంగాల రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లి, ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, ధరూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గల్లంతైన వ్యక్తి కోసం అగ్నిమాపక సిబ్బందిని, గజ ఈతగాళ్లను పిలిపించి చీకటి పడే వరకు గాలించినా మృతదేహం లభించలేదు. తిరిగి గురువారం ఉదయం గద్వాల సీఐ టి. శ్రీను, ధరూర్ ఎస్ఐ తారక మరియు పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సహాయక చర్యలు ముమ్మరం చేశారు. గజ ఈతగాళ్లు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాల సహాయంతో రిజర్వాయర్‌లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ధరూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.





ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులకు రూ.26 వేల వేతనం చెల్లించాలి

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 12(ప్రభాత ఉదయం):

గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కాంట్రాక్టు కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. 10 నుంచి 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు నాలుగేళ్లుగా వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, చట్టబద్ధమైన సెలవులు, వార్షిక బోనస్, రెండు జతల యూనిఫారాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్మికుల వేతనాల నుంచి మినహాయిస్తున్న ఈఎస్ఐ, పీఎఫ్ మొత్తాలను నిబంధనల ప్రకారం వారి ఖాతాల్లో జమ చేయాలని, కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించకపోతే ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త కాంట్రాక్టర్లను నియమించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి ఆశన్న, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, వెంకటేష్, యూనియన్ నాయకులు భాషా, నాగరాజు, లక్ష్మణ్, చామంతి, భాషా, చిట్టెమ్మ, అమరేష్, ఇంద్రమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కాట సుధా శ్రీనివాస్ గౌడ్

పటాన్ చెరు, నవంబర్ 12(ప్రభాత ఉదయం):



సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కాట సుధా శ్రీనివాస్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా, తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పార్టీ అధిష్ఠానం తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల కాట సుధా శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. మహిళా సమస్యల పరిష్కారానికి, మహిళల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర నాయకత్వం తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.




ఓపీఎస్ పునరుద్ధరణకు నవంబర్ 17న సామూహిక సెలవు

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 12(ప్రభాత ఉదయం):

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 12(ప్రభాత ఉదయం):కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 17న సామూహిక సెలవులు పాటించాలని టీఎస్ సిపిఎస్ ఈ యు రాష్ట్ర శాఖ పిలుపునిచ్చింది. ఈ మేరకు జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సెలవులకు దరఖాస్తు చేసుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా మల్దకల్ మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ ఆంజనేయులు రెడ్డికి సామూహిక సెలవు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో జాకీర్, ఖాజామీర్, తిరుమలయ్య, రాఘవేంద్రగౌడ్, రాజు, రాములు, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాపై జరిమానాలు.. రూ.5 వేల వరకు వసూలు

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 12(ప్రభాత ఉదయం):



ఎల్లనినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని అయిజ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. మున్సిపల్ అనుమతి లేకుండా నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేయరాదని, పైప్‌లైన్లకు మోటార్లు బిగించి నీటిని తోడితే రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.కారు కడిగితే రూ.5 వేలు, బైక్ కడిగితే రూ.2 వేలు, ఇంటి ముందు నేలను కడిగితే రూ.2 వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ప్రతి నల్లా కనెక్షన్‌కు బిబ్ ట్యాప్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, నీటి వినియోగం అనంతరం కుళాయిలను బిగించాలని సూచించారు. నీటి వృథా, అక్రమ వినియోగం గుర్తిస్తే మున్సిపల్ నీటి సరఫరా సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ప్రజలందరూ సహకరించి నీటిని పొదుపు చేయాలని విజ్ఞప్తి చేశారు.



వెంకన్న స్వామి వారిని దర్శించుకున్న రెవెన్యూ అధికారులు

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 12(ప్రభాత ఉదయం):

కేటీదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారిని గురువారం కేటీదొడ్డి డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంతకుముందు ఆలయానికి చేరుకున్న అధికారులకు ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య వారికి ఆశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. వారి వెంటా భూభారతి ఆపరేటర్ నవీన్, మీ సేవ ఆపరేటర్ వెంకటేషన్ నాయుడు, తదితరులు ఉన్నారు



5జీ, డ్రోన్ సాంకేతికతలపై 'గీతం' యూనివర్శిటీలో మూడు రోజుల వర్క్‌షాప్

పటాన్ చెరు, నవంబర్ 11 (ప్రభాత ఉదయం):



అధునాతన సాంకేతికతలైన 5జీ, డ్రోన్ టెక్నాలజీలపై అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల హైబ్రిడ్ కార్యశాల ముగిసింది. గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌కు చెందిన సీఎస్‌డఎస్ఈ, ఏఐడీఎస్ విభాగాలు సంయుక్తంగా ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించాయి.కార్యక్రమంలో భాగంగా 5జీ ఆర్కిటెక్చర్, మానవరహిత వైమానిక వాహనాలు (యూఏవీలు), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఎడ్జ్ కంప్యూటింగ్, అటానమస్ నావిగేషన్ వంటి అంశాలపై నిపుణులు సాంకేతిక ప్రదర్శనలు, హ్యాండ్స్-ఆన్ సెషన్లు నిర్వహించారు. స్మార్ట్ వ్యవసాయం, స్మార్ట్ సిటీలు, విపత్తు నిర్వహణ రంగాలలో ఈ సాంకేతికతల అనువర్తనాలు, పరిశోధనా అవకాశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ వర్క్‌షాప్‌లో ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీడీఎం కర్నూలు, ఐఐఎస్సీ ఆర్ట్ పార్క్ బెంగళూరు తదితర ప్రతిష్టాత్మక సంస్థల నుంచి విచ్చేసిన ప్రముఖ పరిశోధకులు, ప్రొఫెసర్లు వక్తలుగా వ్యవహరించి విలువైన సూచనలు అందించారు. భవిష్యత్ పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడేలా ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దినందుకు విద్యార్థులు, అధ్యాపకులు గీతం యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌ను సన్మానించిన పటేల్ యూత్ ఫోర్స్ ప్రతినిధులు

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 12(ప్రభాత ఉదయం):

మున్నూరు కాపు సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5కోట్లు మంజూరు చేయడంపై జోగుళాంబ గద్వాల జిల్లా మున్నూరుకాపు కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్ లో మున్నూరుకాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ని గద్వాల మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను సన్మానించి, ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మున్నూరు కాపు సామాజిక వర్గం ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా పటేల్ యూత్ ఫోర్స్ కన్వీనర్ కొత్త గణేష్, గద్వాల పట్టణాధ్యక్షుడు పరుశరాముడు,రాష్ట్ర నాయకులు అమరనాథ్ , నాయకులు సురేష్, అఖిల్ , తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608